# "పురాగ టిక్కటా సారు....?"

గిప్పుడున్న గోదావరిఖని మునుపు లేకుండెనట. గా జనుగామూరొక్కటే ఉండెనట. గిక్కడ గ్గుబాయిలు పడ్డంక గీ వూరు పొందింది. గిప్పుడిక్కడ వెయిలమంది బొగ్గుబాయిల్ల పన్జేత్తంఁడ్రు. క్కడి బొగ్గుసెయ్యవట్టే ఎస్పీఐల యూరియ, ఎన్టీపీసి, రామగుండంల కరెంటు తయారైతంది. క్కడ మోటుకట్టం జేసుకుంట బొగ్గుదవ్వెటోల్లంత పల్లెటూల్లల్లకెల్లి అచ్చినోల్లే. సిన్నసిన్నెవుసాలతోని కుపునిండక కడుపుసేతుల వట్టుకోని కొందరచ్చింఁడ్రు. పాలేర్లుండి ఊళ్ళల్ల బతుకుదెరువు లేక ట్టతిప్పలకు కొందరచ్చింఁడ్రు. సేతినిండ పన్దొరుకక కయికిలి గంబలి సేసుకునెటోల్లు కొందరచ్చింఁడ్రు. ట్ల ఊల్లల్లకెల్లి అరొక్కకులపోల్లు, తీరుతీరు పనిజేసెటోల్లు గిక్కడ జమయి కల్సిమెల్సి బతుకుతంఁడ్రు. ఏండ్లవట్టి పన్జేత్తున్న గూడ ఊల్లల్లుండె కలుపుగోలుతనంతో ఒగలకొగలు సాయం జేసుకుంట బతుకుతంఁడ్రు.

ఈల్లల్ల కొందరికి సింగరేణోల్ల క్వార్టర్లున్నా గవ్వేమిటికి మొదలుగావు. సానమంది జాగ దొరికిన డ గుడిసెలేసుకున్నరు. కొందరిండ్లే కట్టుకున్నరు. గుడిసెల సుట్టూర మురిక్కాలువలు. దోమలు, న్ను, మసానం....బొగ్గు పొయ్యిలతోటి వంట జేసుకుంటరాల్లు.

ఎప్పుడు సూసినా గోదావరిఖన్నుంచి కన్నాగురం, కన్నాగురం నుంచి గోదావరిఖని పొయ్యె బస్సులు గాని, సింగరేణి రైలుగాని ఫుల్లుగ మందితోన్నిండుంటయి. పండుగలప్పుడయితె గోరంగ ముందుంటరు. మొన్నటెండకాలంల నేనోపారి కన్నాగురం పోవుటానికని గోదావరిఖన్లె బస్సెక్కిన. బస్సునిండ మాలేసుగ[54] మందున్నరు. మస్తుగుడుక పోత్తంది. సెముటలు కారుతన్నయి. అతికష్టంగ గోల్మాల్జేత్తె నాకెనుకో సీటు దొరికింది. మంది ఒగలనొగలు ఒత్తుకుంటంఁడ్రు. మందిలనుంచి సందుజేసుకోని కండక్టర్ ఎనుక దిక్కచ్చిండు. పైసల్దీసుకొని టిక్కట్లు సింపిత్తండు. నా ముందు న్న సీట్ల ఒక్కాడామె. ఆమె పక్కనో ముసలయినె, అయినెపక్కనింకో ముసలయినున్నడు.

"టికెట్-టికెట్" అనొర్రుకుంట కండక్టరు పైసల కోసురం సేతుల్జాపుతండు.

ఆ ఆడామె కండక్టరును కిందినుంచి మీదిరాక ఓపారి రొండుసార్లు సూసింది.

"అయ్యో సార్. నువ్వేనా?" అంది ఆశ్చర్యం.

"నేన్నేను గాకుంటెవ్వలైతరు గని పైసల్దియ్యి" అన్నడు కండక్టరు నవ్వుకుంట.

"గది గాద్సార్ నువ్వు నన్నేర్పాటు జేత్తలెవ్వా?"

"రోజును ఎంటికెలంత మందిజూత్తన్న. ఎంతమందినేరుపాటు జెయ్యాలె తల్లి. పైసలియ్యి"

"మా వూరు మీ వూరేగద సారు. మాది సొప్పదండి. నేను బెస్తరాములు బిడ్డెను. నా పేర్రాజవ్వ. నువ్వు సాలెపోషాలు కొడుకువు గదా" అందామె.

"నువ్వన్నది నిజమేకని నువ్వు గిక్కడికెందుకచ్చినవు?" అన్నడు కండక్టరు.

రాజవ్వ మొకం ఫాటంతయింది.

"గిక్కడ మా అయినె బాయి పన్జేత్తండు గదా......!

"అట్లనా! అయితెక్కడుంటర్రు? క్వాటర్ దొరికిందా? లేదా?"

"క్వాటర్ మాటేడిది సార్? పై ఇంక్లైన్ గడ్డకు గుడిసేసుకున్నం. మీరేడుంటంర్రు సారు?' అంది రాజవ్వ.

"పొరవుజు బస్తేలుంటన్నగని గీ ముసలయినెవ్వలు?" తన పనిజేసుకుంటనే మాట్లాడుతండు కండక్టరు.

"మా మ్యానమామగద సారు. నువ్వు మా సూసినవు"

"మరేడికి పోతున్నవిప్పుడు?"

"మోదుంపురం. మా అత్తగారింటికి. బియ్యం పట్టుకత్తనని పోతన్న"

"అయితెమానెఆయె గని ఆల్జెమయితంది. పాసెంజర్లు లొల్లివెడుతరు. పైసల్దియ్యి"

రొండ్లెకెల్లి సంచిదీసి అండ్లనుంచి పైసల్దీసిచ్చింది రాజవ్వ.

రొండు టిక్కట్ల పైసల్దీసుకోని చిల్లరిచ్చి టిక్కట్లు సేతిలవెట్టిండు కండక్టరు.

"అయ్యో సారు! ఏర్పాటున్నోల్లగ్గూడ పురాగ టిక్కటా సారు?" అందామె. కండక్టరు నవ్విండు.

"అవ్వా! గిది నాసంత బస్సుగాదు. నా అవ్వయ్యచ్చినా బస్సుల పురాగ టిక్కటే కొడుత' అనుకుంట ముంగటికెల్లి పెయిండు కండక్టరు.

రాజవ్వ పొంటున్న ముసలోల్లిద్దరు ముచ్చెట్లల్ల వడ్డరు.

"ఎనుకట గీ బస్సులేడియే! ఆమెడలకామెడలు నడిసిపోలేద! ఎక్కడెములాడ? ఎక్కడి కొమిరెల్లి! సద్దులు వట్టుకోని నడ్సిపెయినం. గిప్పుడేమో కీక పెట్టన్న లేనూరిగ్గూడ రూపాయలిచ్చి బస్సెక్కి పోవట్రి. సూకాలకు మరిగిర్రుడు గిప్పటికాలపోల్లు. నా అసోంటి సాతగాని ముసలోల్లు బస్సెక్కితె ఎక్కిరి గని సాతనయిన పోరగాండ్లు, సోరపోరగాండ్లు గూడ గీన్నుంచి గాడికన్న బస్సులెక్కంది పోతలేరు"

నేనాల్ల మాటలినుకుంట కూసున్న.

"మన కాలంల గిన్ని సిందునాలెక్కడున్నయే? ఒక్క పెద్ద పైసిత్తె కండెడంత తెల్ల గల్లచ్చేటిది?

ఏకాన్న వెడితె ఇద్దరు మనుషులు బొర్రెదాక తాగినాగనొడువకపొవు. గిప్పుడు రొండుమూడు రూపాయలద్దాగుతె గుండిగన్న దాటుతలేదు".

ఇన్నాకొద్ది అల్ల మాటలినాలనిపిత్తంది.

"గిప్పుడు పైసకేం విలువలేత్తియ్యి. నా కొడుకు బాయిపన్జేత్తండు. నూర్లకొద్ది జీతం మావత్తంది. కని మల్ల నెల గడిసెవారకెక్కడి యక్కన్నే పోతయి. ఐదు పదింక బాకీలే మిగుల్తయి' .

గిప్పటి పోరగాండ్లు అడ్డంగోలు కరుసువెడుతరు. సిన్మలకని అదని ఇదని సిల్లర గత్తురం జేత్తరు. మల్ల అవ్వయ్యలకు బువ్వ పెట్టుటానికేమొ ఏడుత్తరు. సదువుకున్నోల్లు సానమంది లంగలయితండ్రు."

"మన కాలంల ఇంటికెంత మందచ్చిన గని బువ్వదినంది పొనిచ్చెటోల్లమా? నౌకర్లు జేసెటోల్లయితె ఇంటికి మనిషత్తె కిందిమీదయితరు. చాపోసి ఎల్లగొట్టన్నని సూత్తరు".

"అవుగని ఎవ్వల బాదలాల్లకున్నయి. నౌకరోల్లన్ని కొనుడేనాయె. ఊళ్ళనయితె గుమ్ముల్లయితోడి పెడితిమి."

బస్సు నడుత్తంది. అల్ల మాటలినుకుంటు వాన్ని నడుమ కల్పించుకొనన్న.

"సరెగని తాత. నీకు మునుపటికాలం మంచిగుండెనా? గిప్పటిదా?" అన్న నేను.

నా మాటలిని నా మొకాన జూసిండు. తాపకోసారి నాదిక్కు జూసుకుంటన్నడు.

"సదువుకున్నోల్లు మీకు తెలువందేంది? నేను మీకు సెప్పెటోన్నా! కని ఎప్పటి కట్టాలప్పుడున్నయి. మా సిన్నప్పుడు గత్తరసొంటిదచ్చిందంటె ఊల్లకూల్లే తన్నుకపొయేటియి. ఊర్నిండ పీనుగులే. గిప్పుడుగా గత్తర్లేడున్నయి? మునుపు దొరలకెదురుంగ నిల్సుండి మాట్లాడేటోల్లా? గిప్పుడు గట్లేంలేదు. మునుపు మందుల బువ్వల్లేవు. గింతురుకులాటల్లేవు. గిప్పుడున్నంతిషపొత్కాల్లేవు.[55] దెబ్బయేండ్ల కచ్చిన నేను. ఊరుపెట్టునడుత్త. గిప్పటోల్లు నడుత్తరా? అయితె గిప్పుడు గురిమరియాద లేకుంటయిపెయింది. గివ్వన్నీటి సంగతెందుగ్గని గప్పుడయిన, గిప్పుడయిన ఉన్నోడు కాలుమీన[56] కాలేసుకోని కాల్జెయ్యదులకుంటనే బతుకుతండు. లేనోని కున్నతిప్పలు గప్పుడు గిప్పుడు ఉండనే ఉన్నయి. గందుకే ఎదురు తిరుగుల్లు".

ఓ దిక్కు పురాగ టిక్కటా సారు అనే తెలువన్తనం మరోదిక్కు గుండ్లకెదురుంగ నిల్సుండి పొట్లాడుతున్న తెగువతనం. గిదీ నా తెలంగాణా అనుకున్న నా అండ్ల నేను.

ఇంతల ఆల్లూరు రాంగనే దిగిపెయిండ్రు.

ముసలయినె మాటల్లున్న అగ్గసొంటి సత్తెం గురించి ఆలోసించుకుంట కన్నాగురంల అడుగువెట్టిన.